క్లుప్తంగా

నిబంధనలతోనే సురక్షితం



సూచిక బోర్డుల వద్ద సీఐ సైదా

గజ్వేల్‌రూరల్: వాహనదారులు రోడ్డు, ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తే సురక్షితంగా గమ్య స్థానాలకు చేరుకోగలరని సీఐ సైదా అన్నారు. మండల పరిధిలోని కొల్గూరు శివారులోని మూల మలుపుల వద్ద శుక్రవారం ప్రమాద హెచ్చరిక, సూచిక బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతివేగం ప్రమాదకరమన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వ పతనం తప్పదు



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

దుబ్బాక: కాంగ్రెస్ ప్రభుత్వం పతనం కాక తప్పదని కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు సత్తు తిరుమల్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు హీర్యానాయక్‌కు బేడీలు వేసి ఆసుపత్రికి తీసుకపోవడాన్ని నిరసిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో శుక్రవాంర నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లగచర్లలో తమ భూములు తీసుకోవద్దని ఆందోళన చేసిన రైతులను అరెస్టు చేసి జైల్లో పెట్టడం, రైతుకు గుండెనొప్పి వస్తే ఆస్పత్రికి కూడా బేడీలు వేసి తీసుకెళ్లడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. కార్యక్రమంలో రమేష్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, భాస్కర్, కిషన్, వంశీ, అశోక్, రమణారెడ్డి, నేహాల్‌గౌడ్, కనకరాజు, నరేశ్, రాజు తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న సమ్మె



మాట్లాడుతున్న తిరుపతిరెడ్డి

సిద్దిపేటరూరల్: తమ సమస్యల పరిష్కారం కోసం సమగ్ర శిక్షా ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారం కూడా కొనసాగింది. వారికి టీపీటీఎఫ్ జిల్లాశాఖ సంఘీభావం తెలిపింది. ఆ సంఘం రాష్ట్ర నాయకుడు తిరుపతిరెడ్డి మాట్లాడుతూ సిబ్బందికి సమాన వేతనం చెల్లించాలన్నారు. సెలవులు ఇవ్వాలని, హెల్త్ కార్డులు జారీ చేయాలని, సర్వీసులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. సత్యకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కోతుల బెడదను అరికడతాం



పరిశీలిస్తున్న రజిత

హుస్నాబాద్: కోతుల బెడదను పూర్తిగా అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత చెప్పారు. పట్టణంలోని పలు వార్డుల్లో కోతులను పట్టే విధానాన్ని శుక్రవాంర ఆమె పరిశీలించారు. అనంతరం మాటాడుతూ కోతుల బెడదను నివారించేందుకు ప్రత్యేక సిబ్బందిని నియమించామన్నారు. మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, కౌన్సిలర్ స్వర్ణలత పాల్గొన్నారు.

ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ పరామర్శలు



చెక్కు అందజేస్తున్న ప్రతాప్‌రెడ్డి

కొండపాక(గజ్వేల్): మండలంలోని పలు గ్రామాల్లోని బీఆర్‌ఎస్ కార్యకర్తల బాధిత కుటుంబాలను శుక్రవారం ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి పరామర్శించారు. దుద్దెడలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఓ కార్యకర్త కుటుంబానికి రూ.2లక్షల ప్రమాద బీమా చెక్కును అందజేశారు. అలాగే రోడ్డు ప్రమాదంలో గాయపడిన అఖిల్‌గౌడ్‌ను పరామర్శించారు. మాజీ ఎంపీటీసీ బాలాజీ తండ్రి నారాయణ, మర్పడ్గలో గున్నాల మల్లేశం నానమ్మ లచ్చవ్వ, మెరుగు మల్లేశం, దమ్మి బాలయ్య ఇటీవల మృతి చెందగా వారి కుటుంబాలను పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు కుమార్, దుర్గయ్య, శ్రీనివాస్, ఎల్లం, తిరుపతి, మల్లేశం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్‌కే మొగ్గు

ఆంక్షలు లేవు.. లాభం ఎక్కువ

- ఐదు ప్రభుత్వ కేంద్రాల్లో కొనుగోళ్లు సున్నా
- ధాన్యం అమ్మడానికి రైతులు వెనుకంజ

రైతులు వానాకాలం సీజన్‌లో పండించిన ధాన్యం ప్రైవేట్ వ్యాపారుల చెంతకే చేరుతోంది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు రైతులు తమ ధాన్యాన్ని విక్రయించడానికి అంతగా ఆసక్తి చూపడం లేదు. ప్రభుత్వం సన్న రకం ధాన్యానికి రూ.500లు బోనస్ ఇస్తున్నా ప్రైవేట్ వ్యక్తులకే విక్రయిస్తున్నారు. ఎక్కువ ధర రావడమే దానికి కారణం.



బస్తాల్లో ధాన్యం నింపుతున్న రైతులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): జగదేవ్‌పూర్ మండలంలోని వివిధ గ్రామాల్లో ఈ వానాకాలం సీజన్‌లో సుమారు 10,400 ఎకరాల్లో వరి సాగుచేశారు. 3,071 ఎకరాల్లో సన్నరకం, 7,329 ఎకరాల్లో దొడ్డు రకం సాగుచేశారు. ప్రస్తుతం పంట చేతికి అందింది. రైతులు పండించిన ధాన్యాన్ని విక్రయించుకొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. జగదేవ్‌పూర్ పీఏసీఎస్ ఆధ్వర్యంలో జగదేవ్‌పూర్, మర్కూక్ మండలాల్లో మొత్తం 14 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. అలాగే జగదేవ్‌పూర్‌లో ఐకేపీ ఆధ్వర్యంలో మూడు కేంద్రాలను ఏర్పాటుచేసి రైతుల నుంచి ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించారు.

ఐదు కేంద్రాల్లో గింజ కూడా కొనలేదు

మండలంలో వివిధ గ్రామాల్లో ధాన్యం విక్రయాలు జరిగినా.. ఐదు గ్రామాల్లో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో నేటికీ గింజ ధాన్యం కూడా కొనుగోలు జరగలేదు. తిమ్మాపూర్, గొల్లపల్లి, ధర్మారం, దౌలాపూర్, తిగుల్ గ్రామాల్లో పూర్తిగా రైతులు ప్రైవేట్ వ్యాపారులకే అమ్ముకున్నారు.

అక్కడే ఎక్కువ ధర

ప్రభుత్వం దొడ్డు రకానికి మద్దతు ధర రూ.2,300, సన్న రకానికి రూ.2,320 అందిస్తోంది. తేమలేకుండా, పూర్తిగా ఆరబెట్టుకుని తీసుకువస్తేనే మద్దతు ధర లభిస్తుంది. అయితే ప్రైవేట్ వ్యాపారులు అవన్నీ లేకుండానే దొడ్డు రకానికి రూ.2,300 నుంచి రూ.2,400 వరకు, అదే సన్న రకానికి రూ.2,400 నుంచి 2,600 వరకు విక్రయిస్తున్నారు. దీంతో రైతులు ప్రైవేట్ వ్యాపారుల వైపే మొగ్గు చూపుతున్నారు. గతేడాది పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఇదే సీజన్‌లో రైతుల నుంచి రూ.42 వేల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేయగా, ప్రస్తుతం 15 వేల క్వింటాళ్లు మాత్రమే కొనుగోళ్లు చేశారు.

ప్రైవేట్ వ్యాపారులకే అమ్ముకున్నా..



వానాకాలం సీజన్‌లో ఎకరంన్నర భూమిలో సన్నరకం వరి ధాన్యాన్ని సాగు చేసిన. కొంత తినడానికి పక్కన పెట్టుకుని 15 క్వింటాళ్ల ప్రైవేట్ వ్యాపారులకే అమ్ముకున్నాను. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రంలో అమ్ముదామనుకుంటే తేమశాతం లేదని చెప్పడం, పూర్తిగా ఆరలేదని సాకులు చెప్పారు. దీంతో పాటు వర్షాలు కురుస్తాయనే భయం వల్ల వెంటనే అమ్మేశాను.

– సత్యనారాయణ, రైతు తిమ్మాపూర్

క్రిస్మస్ వేడుకలకు ప్రభుత్వ ప్రోత్సాహం

- నియోజకవర్గానికి రూ.2లక్షలు
- అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్



మాట్లాడుతున్న అబ్దుల్ హమీద్

సిద్దిపేటరూరల్: అన్ని నియోజకవర్గ కేంద్రాల్లోను క్రిస్మస్ వేడుకలు నిర్వహించుకోడానికి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ చెప్పారు. కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో రెవెన్యూ, మున్సిపల్, పోలీస్ అధికారులు, క్రైస్తవ సంఘాల ప్రతినిధులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రిస్మస్ వేడుకల నిర్వహణకు ప్రతి నియోజకవర్గానికి రూ.2లక్షలు అందజేయనున్నట్లు చెప్పారు. వివిధ క్రిష్టియన్ సంఘాలు ఒక కమిటీగా ఏర్పడి 25లోగా ఈ వేడుకలు నిర్వహించుకోవాలన్నారు. ప్రతి నియోజకవర్గంలోను ప్రజా ప్రతినిధులను సంప్రదించి సమయం, వేదికను ఎంపిక చేసుకోవాలని చెప్పారు. పాస్టర్ల ద్వారా క్రైస్తవులందరికీ తెలియజేసి విందు భోజనం ఏర్పాటు చేసుకోవాలన్నారు. మున్సిపల్ కమిషనర్లు వేదికల వద్ద శానిటేషన్ కార్యక్రమాలు చేపట్టాలని, పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి షేక్ అహ్మద్, సిద్దిపేట, గజ్వేల్, హుస్నాబాద్ ఆర్డీఓలు సదానందం, చంద్రకళ, రామ్మూర్తి, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడితే చర్యలు

- వి మార్ట్ నిర్వాహకులకు రూ.20వేల జరిమానా
- మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్



వి మార్టు నిర్వాహకులకు జరిమానా రశీదును అందజేస్తున్న ఆశ్రిత్ కుమార్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులు వినియోగిస్తే కఠిన చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ హెచ్చరించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లతో కలిసి శుక్రవారం ఆయన స్థానిక వి మార్టులో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ పేపర్ ప్లేట్లు, గ్లాసులు ఉండటం గమనించి ఆ యాజమాన్యానికి రూ.20వేలు జరిమానా విధించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం వల్ల క్యాన్సర్ బారిన పడవలసి వస్తుందన్నారు. ప్లాస్టిక్ వాడకంపై నిరంతర తనిఖీలు కొనసాగిస్తామని, వాడినా, అమ్మినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో అధికారులు శ్రీనివాస్ రెడ్డి, సతీశ్, మాధవి తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే.. సమాజ అభివృద్ధి

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందితేనే సమాజం అభివృద్ధి చెందుతుందని మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ అన్నారు. ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా మహేంద్ర మహిళా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటైన ఈవెంట్ మేనేజ్‌మెంట్, డెకరేషన్ వర్క్స్‌ను ఆయన ప్రారంభించారు. యూనియన్ బ్యాంక్ మంజూరు చేసిన రూ.20లక్షల పత్రాన్ని గ్రూపు సభ్యులకు అందజేశారు.

విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలి



విజేతలైన విద్యార్థులతో ఎమ్మెల్యే సత్యనారాయణ

మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి

బెజ్జంకి(సిద్దిపేట): విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోను రాణించాలని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పిలుపునిచ్చారు. బెజ్జంకి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న సీఎం కప్ పోటీలు ముగింపు కార్యక్రమానికి శుక్రవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడల వల్ల పోటీతత్వం పెరగుతుందని, ఆరోగ్యంగా ఉంటారన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్‌లు ప్రదానం చేశారు. అలాగే ఇటీవల యూత్ కాంగ్రెస్ ఎన్నికలలో గెలిచిన నాయకులను సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీఓ ప్రవీణ్, ఎంఈఓ మహతి లక్ష్మి, మాజీ ఎంపీపీ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఒగ్గు దామోదర్, ఏఎంసీ చైర్మన్ పులి కృష్ణ, పార్టీ మండల అధ్యక్షుడు రత్నాకర్‌రెడ్డి, హెచ్‌ఎం శ్రీరాములు, ఏఈ సమ్మయ్య, పీడీ మాలతి, వైస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు పోచయ్య, మల్లేశం, నర్సయ్య, సంతోష్, శ్రీనివాస్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు ప్రారంభం

మండలంలోని దాచారంలో ఈజీఎస్‌లో నిర్మించిన సీసీ రోడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. ప్రభుత్వ పాఠశాలలో వంటగది నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

దాడి ఘటనలో ఒకరిపై కేసు

అక్కన్నపేట(హుస్నాబాద్): అన్నదమ్ముల పరస్పర దాడి ఘటనలో ఒకరిపై కేసు నమోదైంది. ఎస్‌ఐ విజయ్‌భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం.. మల్లంపల్లి గ్రామానికి చెందిన టేకుల సంపత్, శ్రీనివాస్ ఇద్దరు అన్నదమ్ములు. మూడు రోజుల కిందట గ్రామంలో తమ్ముడు శ్రీనివాస్ షాపు పక్కనే అన్న గ్యారేజీ ఏర్పాటుకు రేకులు తదితర సామగ్రిని సమకూర్చుకున్నాడు. ఈ క్రమంలో ఆ ఇద్దరి మధ్య గొడవ చోటుచేసుకుంది. సంపత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అంబేడ్కర్ జాతీయ అవార్డుకు శ్రీనివాస్ ఎంపిక



దుబ్బాక/దుబ్బాక రూరల్: మండలంలోని తిమ్మాపూర్‌కు చెందిన గుర్రాల శ్రీనివాస్ మాదిగ అంబేడ్కర్ జాతీయ అవార్డుకు ఎంపికైనట్లు బహుజన సాహిత్య అకాడమీ జాతీయ కమిటీ అధ్యక్షుడు నల్ల రాధాకృష్ణ తెలిపారు. బడుగు బలహీన వర్గాలు, దళిత జాతిని చైతన్యం చేయడం, గ్రామీణ ప్రాంతాల్లో విశేష కృషి చేసినందుకు ఈ అవార్డుకు ఎంపికయ్యారని చెప్పారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌ను పలు సంఘాల నాయకులు అభినందించారు.

క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు అభినందనలు

గజ్వేల్‌రూరల్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని మంజీరా విద్యాసంస్థల కరస్పాండెంట్ అంబదాస్, డైరెక్టర్ రజిత అన్నారు. సీఎం కప్ పోటీల్లో భాగంగా ఖోఖో క్రీడలో పాఠశాలకు చెందిన క్రీడాకారులు ప్రథమ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా శుక్రవారం రజిత క్రీడాకారులు, పీడీ ఐలయ్య, ఉపాధ్యాయులను అభినందించారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



క్రీడాకారులను అభినందిస్తున్న రజిత

బేడీలు వేయడమేనా ప్రజాపాలన?

ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ఆగ్రహం



విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి, వెంకటయ్య

దుబ్బాక: ప్రజాపాలన అంటే రైతులకు బేడీలు వేయడమేనా అని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నించారు. స్థానిక ఎస్సీ బాలుర హాస్టల్‌ను రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యతో కలిసి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అలాగే క్యాంపు కార్యాలయంలో బాధిత కుటుంబాలకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. పలు కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. గిరిజన రైతు హీర్యానాయక్‌కు గుండె నొప్పివస్తే ఆస్పత్రికి కూడా చేతికి బేడీలువేసి తీసుకెళ్లడం దారుణమన్నారు. సంక్షేమ హాస్టళ్లల్లో సమస్యలున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.

బేషరతుగా క్షమాపణ చెప్పాలి

సిద్దిపేటజోన్: గిరిజన రైతుకు సంకెళ్లు వేసిన ప్రభుత్వం రైతులకు క్షమాపణ చెప్పాలని జిల్లా రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షుడు వంగ నాగిరెడ్డి డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రిమాండ్‌లో ఉన్న రైతుకు ఛాతీ నొప్పి వస్తే బేడీలు వేసి ఆస్పత్రికి తీసుకువెళ్లడం దారుణం అన్నారు. లగచర్ల రైతులందరినీ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ నరేందర్ రెడ్డి, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ ప్రభాకర్ వర్మ, నాయకులు మోహన్ రెడ్డి, జనార్దన్, నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

హాస్టళ్లలో భోజనం కలుషితం కావొద్దు

అక్కన్నపేట(హుస్నాబాద్): ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లలో భోజనం కలుషితం కాకుండా చూడాలని ఏబీఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జనార్దన్ డిమాండ్ చేశారు. మండలంలోని గోవర్ధనగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనంతో పాటు పాఠశాల పరిసరాలను శుక్రవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లలో గత ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలనే కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అనుసరిస్తోందన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు, కాస్మెటిక్ చార్జీలు పెంచినప్పటికీ కొన్ని హాస్టళ్లలో మెనూ పాటించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాలలు, హాస్టల్లో మౌలిక సదుపాయాలు కల్పన, నాణ్యమైన భోజనం అందిచడంపై దృష్టిసారించకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో రఘు, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే



చిన్నకోడూరు(సిద్దిపేట): చర్ల అంకిరెడ్డి పల్లిలో ..

సిద్దిపేటకమాన్/ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)/చిన్నకోడూరు(సిద్దిపేట): ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రక్రియ జిల్లా వ్యాప్తంగా జోరుగా కొనసాగుతుంది. సిద్దిపేటలోని 34వ వార్డులో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రక్రియను కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మార్క సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డులో ఇందిరమ్మ ఇళ్ల కోసం 380దరఖాస్తులు వచ్చాయని, వివరాలను యాప్‌లో నమోదు చేయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆకాశ్, సురేశ్, అనురాధ, నరేశ్, స్నేహ, స్రవంతి, భాగ్యవతి పాల్గొన్నారు. అదేవిధంగా చిన్నకోడూరు మండల పరిధిలోని చర్ల అంకిరెడ్డిపల్లి, అనంతసాగర్ గ్రామాల్లో సాగుతున్న సర్వేలో యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి అజ్జు యాదవ్ పాల్గొన్నారు. ఇళ్ల సర్వే పారదర్శకంగా జరుగుతోందని, లబ్ధిదారులు ఆందోళన చెందవద్దని చెప్పారు. అర్హులైన వారందరికి న్యాయం జరుగుతుందన్నారు. పలు గ్రామాల్లో కొనసాగుతున్న సర్వేను తహశీల్దార్ జయలక్ష్మి, ఎంపీడీఓ జనార్దన్ పరిశీలించారు. కార్యక్రమంలో అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

హామీలపై అసెంబ్లీలో చర్చించండి

డీబీఎఫ్ జాతీయ నేత శంకర్



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మిరుదొడ్డి(దుబ్బాక): ఎస్సీ, ఎస్టీలకు కాంగ్రెస్ ఇచ్చిన ఎన్నికల హామీలపై ఎమ్మెల్యేలు అసెంబ్లీలో చర్చించాలని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ డిమాండ్ చేశారు. చేవెళ్ల డిక్లరేషన్ పేరుతో ఇచ్చిన హామీలపై చర్చించాలని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యకు శుక్రవారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను తుంగలో తొక్కిందన్నారు. అంబేడ్కర్ అభయ హస్తం పేరుతో దళిత కుటుంబానికి రూ.12లక్షల సాయం అందజేస్తామన్న హామీ కార్యరూపం దాల్చలేదని మండిపడ్డారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు బీమ్ శేఖర్, నాయకులు కిరణ్, యాదగిరి, ప్రభాకర్, ఉప్పలయ్య, కిషన్, మహేశ్, సుజాత తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యం



సర్వేలో పాల్గొన్న వెంకట్‌రెడ్డి, బాలయ్య

సిద్దిపేటరూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రజలందరికీ సంక్షేమ పథకాలను అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతోందని జిల్లా కిసాన్ కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ వెంకట్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నారాయణరావుపేట మండల పరిధిలోని గుర్రాలగొంది గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ సంక్షేమ పథకాలు ప్రతీ ఇంటికి అందే విధంగా శ్రేణులు చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు బాలయ్య, మండల యూత్ ఉపాధ్యక్షుడు హరీశ్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, కార్యదర్శి అరుణ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **17న జిల్లా కబడ్డీ జట్టు ఎంపిక**

సిద్దిపేటజోన్: స్థానిక స్టేడియంలో జిల్లా కబడ్డీ జట్టు సభ్యుల ఎంపిక ప్రకియ 17న నిర్వహించనున్నట్లు కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సంతోష్ కుమార్, ప్రధాన కార్యదర్శి శివకుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు 17న హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 95508 47409, 99599 33472 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

◆ **డీటీఎఫ్ సభ్యత్వ నమోదు**

మద్దూరు(హుస్నాబాద్): విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు దేవులపల్లి కిష్టయ్య డిమాండ్ చేశార. మండలంలోని పలు పాఠశాలల్లో శుక్రవారం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 317జీఓను సమీక్షించి ఉపాధ్యాయులకు న్యాయం చేయాలన్నారు. ఉపాధ్యాయులకు రావలసిన డీఏ, పీఆర్సీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చంద్రభాను, రాములు, నర్సింహులు, మల్లేశం, సంపత్, రాజశేఖర్, శిరీష, కవిత తదితదరులు పాల్గొన్నారు.

◆ **ఘనంగా లింగంగౌడ్ వర్ధంతి**

సిద్దిపేటరూరల్: రాఘవాపూర్ మాజీ సర్పంచ్, బ్లాక్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడుగా సేవలందించిన లింగంగౌడ్ వర్ధంతిని ఆయన కుటుంబ సభ్యులు, అభిమానులు, నాయకులు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ లింగంగౌడ్ చేసిన సేవలు మరువలేనివన్నారు. ఆయన కుమారుడు అక్షయ్, మాజీ సర్పంచ్ సత్తయ్యగౌడ్, రామకృష్ణ, రమేశ్‌గౌడ్, తిరుపతి, చందు, నవీన్, గణేశ్, రమేశ్, పర్శగౌడ్ పాల్గొన్నారు.

◆ **విద్యార్థుల భవిష్యత్‌కు సహకరిస్తాం**

హుస్నాబాద్: విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు తమ వంతు సహకారం అందిస్తామని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గంగాధర్ చెప్పారు. శుక్రవారం కళాశాలలో తల్లిదండ్రుల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నట్లు చెప్పారు. అధ్యాపకులు రజని, సత్యనారాయణ, రణధీర్ కుమార్, అశోక్, రాజిరెడ్డి, విద్యాసాగర్, చంద్రమోహన్, వాల్యా తదితరులు పాల్గొన్నారు.

◆ **నేత్రపర్వం.. మహా పడిపూజ**

వర్గల్(గజ్వేల్): మండలంలోని గౌరారంలో అయ్యప్ప మహా పడిపూజ నేత్రపర్వంగా సాగింది. శుక్రవారం హరిహర గురుస్వామి ఆధ్వర్యంలో పదునెట్టాంబడి జ్యోతుల వెలిగింపు పూజ జరిగింది. పూజల్లో ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, మాలధారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

◆ **ఎంపీడీఓకు వినతి**

సిద్దిపేటరూరల్: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కారం కోరుతూ చేపట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమానికి అన్ని గ్రామాల సిబ్బంది హాజరు కావాలని జీపీ ఉద్యోగ, కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మహేశ్ పిలుపునిచ్చారు. 17న జరగనున్న ఆ కార్యక్రమానికి పంచాయతీ సిబ్బంది వెళ్ళేందుకుగాను నారాయణరావుపేట ఎంపీడీఓకు శుక్రవారం వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో రాజలింగం, మల్లయ్య, నర్సయ్య, భూదవ్వ తదితరులు పాల్గొన్నారు.

◆ **ఎస్సీ రిజర్వేషన్లు అమలు చేయండి**

ప్రశాంత్‌నగర(సిద్దిపేట): సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఆధారంగా రాష్ట్రంలో ఎస్సీ రిజర్వేషన్లను త్వరగా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్ చైర్మన్ షమీం అక్తర్‌కు శుక్రవారం తెలియచేసినట్లు పట్టణ అరుంధతి సంఘం, మాదిగ యువసేన, జాంభవ యూత్, బీజేఆర్ సంక్షేమ సంఘం నాయకులు తెలిపారు. ఇస్తారి, శ్రీనివాస్, ప్రసాద్, నరేష్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

◆ **అరకొరగా డబుల్ బెడ్రూం ఇళ్లు**

హుస్నాబాద్: అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణాలను పూర్తిచేసి లబ్ధిదారులకు ఇవ్వాలని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి బత్తుల శంకర్ బాబు డిమాండ్ చేశారు. శుక్రవారం రాజరాజేశ్వర ఫంక్షన్ హాల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. నాయకులు రాంప్రసాద్, నరేష్, రాజేందర్, అనంత స్వామి, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

◆ **విద్యార్థులకు క్రీడా సామగ్రి వితరణ**

దుబ్బాకటౌన్: మున్సిపల్ పరిధిలోని ధర్మాజీపేట జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థులు విద్యార్థులకు రూ.5 వేలు విలువ గల క్రీడా సామగ్రిని శుక్రవారం అందజేశారు. వారిని హెచ్‌ఎం సాదత్ అలీ కృతజ్ఞతలు తెలిపారు.

◆ **అరుణోదయ 50వసంతాల సభలు**

దుబ్బాక: హైదారాబాద్‌లో 14, 15న జరిగే అరుణోదయ 50వసంతాల సభలకు ప్రజాస్వామికవాదులు, విద్యార్థి మేదావులు, రైతులు, కూలీలు, కవులు, కళాకారులు హాజరై జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా నాయకుడు ఎల్లన్న పిలుపునిచ్చారు.